**కాని ఈ సంతోషం ఎక్కువ కాలం నిలవలేదు. పెళ్ళాల క్కూడా వీళ్ళ సంతోష రహస్యం తెలిసిపోయింది.**

టాట్'' మీరలా ఆనందపడిపోవడానికి వీల్లేదు. ఇవాళ్టినుంచీ మీరెవరూ మీ నిజ గదుల్నుంచి కదలడానికివీల్లేదు. దొంగని పట్టడానికి యింకేదన్నా మార్గం ఆలోచించండి'' అన్నారు పెళ్ళాలు. సరేనని అంతా మళ్ళీ విషాద గడ్డాలు పెంచిచర్చలూ సమావేశాల్లో పడ్డారు.

(గత సంచిక తరువాయి)


ఓ ఆదివారం మధ్యాహ్నం సమావేశంలో మునిగి మార్గం కోసం కొట్టుకుంటున్న అన్ని వాటాల సభ్యుల దృష్టిలో ఓ దృశ్యం పడింది. కుక్క పెద్ద కొడుకు టామీ, టామీ అని పిలుస్తూ ఓ కుక్క తోకకి తనెగరేస్తున్న గాలిపటం దారం కట్టి వినోదిస్తున్నాడు. టామీ భౌభౌ మని అరుస్తూ, తనని ఆకాశంలోకి ఏదో లాగుతున్నట్టు ఫీలవుతూ పిచ్చిగా పరిగెడుతోంది. పైన గాలిపటం కుక్క తోకని పట్టుకుని ఆకాశంలో ఈదుతోంది. ఇది చూడగానే అందరి మనసుల్లోనూ తమ సమస్యకి పరిష్కారం తళుక్కుమన్నది ''కుక్క మనిషికన్నా విశ్వాసంగల జంతువు. కుక్కని నమ్ముకుని కునుకు తీసెయ్యొచ్చు'' అని ముక్తకంఠంతో అంతా అనుకొని, మనకో కుక్క వుండాలి, మనందరం దాన్ని కలిసి పెంచాలి. అది మన యింటిని కాపలా కాయాలి; అనే నిర్ణయానికొచ్చారు.

## నగ్నముని

## విలోమ కథ

## లైకా-మజ్నూ ప్రళయగాథ

రెండోనాటికి పిల్లా పెద్దా అంతా కంటబడిన తలొక వూరకుక్కనీ యింటికి పట్టుకొచ్చేశారు. కుక్కల్తో యింటి వసారా నిండిపోయింది. అది కూడా ఓ పెద్ద సమస్యే అయిపోయింది. ప్రతివారూ, నేను తెచ్చిన కుక్కని పెంచాలంటే,నేను తెచ్చిన కుక్కనే పెంచాలని' పట్టుబడుతున్నారు. అది చివరికి పెద్ద తగాదాలోకి దిగింది. పట్టుదలలు పెరిగినయ్. అంతా కోలాహలంగా ఒకేసారి ఘర్షణలోకి దిగి నానా భాషల్లోనూ మాట్లాడ్డం మొదలెట్టారు. వసారాలో నిలుచున్న కుక్కలకి వీళ్ళ గొడవచూసి విసుగొచ్చింది. గట్టిగా అరవడం మొదలెట్టినయ్. చివరికి భోజనం వేళకి ఒక నిర్ణయాని కొచ్చారు. అదేమంటే ఎవరిదయినా బియ్యం డబ్బా ఖాళీచేసి, దాన్నొక డోర్ కర్టెన్ వెనక టేబుల్ మీద పెట్టి రహస్యంగా చిన్న చిన్న కాగితం ముక్కలమీద ఎవరు ఏ కుక్కని పెంచాలని



కోరుకుంటున్నారో దాని నంబరు వేసి, ఆ డబ్బాలో పడేసి తద్వారా ఎక్కువ ఓట్లు దేనికి వస్తాయో దాన్ని పెంచుదాం అనుకున్నారు. వాటి మెళ్ళో నంబర్లు రాసిన రిబ్బన్లు కట్టారు. చీట్లు వేసేంతవరకూ వాటికి తిండి పెట్టాలనుకున్నారు.

ఒళ్ళో వుగ్గు తాగే పిల్లలకీ, పాకే పిల్లలకీ తప్ప తక్కిన సభ్యులందరికీ చీట్లువేసే హక్కువుందని ప్రకటించారు. ఇంక ప్రచారం ప్రారంభమైంది. ఫలానా నంబరుగల కుక్కకే మీచీటీ వేయండి! ఫలానా కుక్క చాలా గొప్పది; అది మన మనుకునే బాధ్యతల్ని చక్కగా నెరవేరుస్తుంది. అంతే గాకుండా; అది మీ వాటాలోకి, మీ వంటింట్లోకి దూరకుండా, అన్నాలూ, కూరల్లో మూతిపెట్టకుండా చక్కగా కాపలాకాస్తుంది, అని కాఫీ, టిఫిన్లు యిచ్చుకోవడంతో ప్రారంభమైన ప్రచారం కూరలు, పిండి వంటలు పంపుకోవడంతో తారస్థాయి నందుకుంది. ప్రతివారూ అవతలి వాటాలోని చిన్నల్ని, పెద్దల్ని ప్రలోభ పెట్టేస్తున్నారు.

బియ్యం డబ్బా బయటికి తెచ్చే రోజు రానే వచ్చింది. చీటీలువేసే కార్యక్రమం నోరుగల కాంతమ్మగారు నిర్వహించింది. అన్ని కుక్కలూ సావిట్లో కాలుగాలిన కుక్కల్లా తిరుగుతూ వుండగా, అంతా ఆత్రంగా ఎదురు చూస్తుండగా ఫలితం ప్రకటించబడింది. రెండు చీట్లు అధికంగావచ్చి కుక్క టేశ్వర్రావ్ తీసుకొచ్చిన కుక్క గెలుపొందింది. నాలుగు చీట్లమీద కుక్కనంబరుకు బదులు కుక్క బొమ్మనే వెయ్యడానికి ప్రయత్నించడంవల్ల ఆ నాలుగు చీట్లూ చెల్లలేదు.

కుక్క కుటుంబ సభ్యులు అంతకు ముందే తీసుకొచ్చి వుంచిన పూలదండని దాని మెళ్ళో వేశారు. పిల్లలు దాన్ని నెత్తిమీద కూచోబెట్టుకుని వూరేగించారు. జానకమ్మ దిష్టి తీసేసింది. కుక్కటేశ్ కుటుంబ నియంత్రణ పాటించకపోవడంవల్ల వాళ్ళ చీట్లు అధికమై వాళ్ళ కుక్క గెలుపొందడానికి అవకాశ మేర్పడిందని చిన్న గొడవ సణుగుడుగా ప్రారంభమై చిలికిచిలికి తుఫాను కాబోయింది గాని, కుక్క కుటుంబసభ్యులు పదితలకాయల్తో, పదినోళ్ళతో, యిరవై

కాళ్ళతో, ఇరవై కళ్ళతో, కొత్తరకమైన జంతువులా మీదపడిపోవడంతో గొడవ సద్దుమణిగింది.

సరే, చేసుకున్న నిర్ణయం ప్రకారం అంతా వంతులవారీగా దాన్ని మేపాలి, అది యింటిపట్టునే వుండి మొత్తం యింటిని కాపలా కాస్తుంది. దానికి "లైకా" అని నామకరణంచేసి, స్వీట్సుపెట్టి మగవాళ్ళు కరచాలనం చేశారు; ఆడవాళ్ళు హారతి వెలిగించి మంగళహారతి పాడారు. తక్కిన వూరకుక్కల్ని వూరిమీదకి తరిమేశారు.

లైకా మామూలు కుక్క కాదనే సంగతి త్వరలోనే అందరికీ తెలిసిపోయింది. అది కుక్కల్లో పెరిగిన జాతికుక్క. ఎన్నుకోబడిన కుక్కేమో చాలా రాజసంగా అన్నీ చేయించుకునేది. తను ఆ గృహాన్ని పరిపాలించడానికే పుట్టినట్లుగా ప్రవర్తించేది. దానికి అన్నీ ఠంచనుగా టైముకి జరగాలి. ప్రతిక్షణం చిన్నాపెద్దా అంతా దాన్నే తల్చుకోవాలి; ముచ్చటగా పిల్చుకోవాలి. మగకుక్కేమో, పైగా అందరిచేతా గుర్తించబడిన కుక్కేమో, సింహంలా నడిచేది. ఖరీదయిన తిండి తప్ప ఏది పెడితే అది తినేది కాదు. దాని హోదా, హొయలు, ప్రత్యేక తరహా చూసి అందరికీ ముచ్చటగా వుండేది. కుక్కు ఆఫీసులో అప్పుజేసి, అది పగలు రెస్టు తీసుకోవడానికని చిన్న పరుపూ, మంచం కూడా ఏర్పాటు చేశాడు.

బాధ్యతంతా దానికొదిలేసి అంతాచక్కగా కాపరాలు చేసుకుంటున్నారు. లైకా కూడా నిద్రపోకుండా కాపలా కాస్తున్నట్లు గంభీరంగా కనిపించేది.

ఇలావుండగా, ఒక రోజున అర్ధరాత్రి, లైకా ఎప్పుడూ లేనిది భీభత్సంగా అరుస్తుంటే అంతా తలుపులు భళ్ళున తీసి, లాంతర్లు పట్టుకుని కోలాహలంగా బయటికొచ్చారు, దొంగని పట్టుకుందేమో, వాణ్ణి చూద్దామని. కానీ, ఆ దరిదాపుల్లో మనిషెవడూ కనబడలేదు. లైకా చుట్టూ మాత్రం ఆడ కుక్కలు గుంపుగా పోగయినయ్ అవి లైకా చుట్టూ యిష్టంగా తిరుగుతున్నయ్. మీద పడుతున్నయ్. లైకా తోక లోపలికి ముడిచేసి కుయ్‌కుయ్‌మని వాటిమీద కోపంగా అరుస్తోంది. దాని అరుపుకీ, కోపానికీ అవి తాత్కాలికంగా పక్కకి తప్పుకున్నట్లు నటించినా, తిరిగి మూతులు ముందుకు చాస్తూ లైకా మూతిమీదకి వస్తున్నయ్. ఆ దృశ్యం చూసిన నాలుగు వాటాల మగాళ్ళు లైకా అదృష్టానికి యీర్ష్య పడ్డారు. నాలుగు వాటాల ఆడాళ్ళు దాని సత్ప్రవర్తనకి ముచ్చట పడ్డారు. కుక్కకున్న బుద్ధి తమ మొగుళ్ళకి లేనందుకు వాళ్ళని తిట్టిపోశారు. లైకాని చూసయినా మగజాతి బుద్ధి తెచ్చుకోవా లన్నారు. చీపుళ్ళు పట్టుకొచ్చి ఆడ కుక్కల్ని దూరంగా పోయేవరకు తరిమి తరిమి కొట్టారు. కుక్కుటేశ్వరరావ్ ఒక్క కుక్కనయినా వుండనివ్వమని ఎంత బతిమాలినా ఎవరూ వినిపించుకోలేదు. ఆ విధంగా ఆడవాళ్ళ చేత ఆడకుక్కలనుంచి రక్షించబడింది లైకా.

కుక్కలన్నీ దూరంగా పోయాక లైకాని మెచ్చుకుంటూ అంతా లోపలికిపోయి తలుపేసుకోబోతుండగా యింతలో మరోదృశ్యం వాళ్ళ కంటబడింది. లైకా చెట్టుకిందే తీవిగా నుంచుంది. అప్పటివరకూ చెట్టు వెనక పొంచున్న మూడు ఆడకుక్కలు అంతా వెళ్ళిపోయాక బయటికొచ్చి లైకాని ఆప్యాయంగా సమీపించాయి. లైకా వాటిని చూడగానే

యిదివరకులా ప్రవర్తించలేదు. తిరిగి వెయ్యబోతున్న తలుపులు బార్లా తెరిచి చీపుళ్ళతో ఆడవాళ్ళు ఆ ఆడకుక్కలమీదకి వెళ్ళబోతే లైకా వాళ్ళమీదకే భౌ భౌ మని తిరగబడింది.

తాము లైకాని అపార్థం జేసుకున్నామనే విషయం చప్పున అర్థం జేసుకుని "నీ మగ బుద్ధి ఎక్కడికి పోతుందీ" అని రుసరుస లాడుతూ అంతా లోపలి కొచ్చేశారు. దీపం తగ్గించబోతూ కిటికీలోంచి చూస్తే లైకా వాటితో హుషారుగా వుండడం కనిపించింది, "నీకూ పబ్లిక్ లైఫూ, ప్రయివేట్ లైఫూ వున్నాయన్నమాట" అని విస్తుబోయాడు కుక్క.

సరే, దాని వ్యక్తిగత విషయాలు మన కెందుకులే, మన యింటిని జాగ్రత్తగా కాపలా కాస్తే చాలునని సరిపెట్టుకున్నారంతా.

మళ్ళీ రోజులు ఉదయాస్తమయాలతో సజావుగానే జరిగిపోతున్నట్లనిపించింది. కానీ అట్లా అట్టేకాలం జరగలేదు. దానికేం జరిగిందో ఏమో లైకా ఒక రోజున వెంకట్రావుని కరిచేసింది. వెంకట్ దాన్ని చితగ్గొట్టబోయాడు. కుక్క అడ్డుపడ్డాడు. "తిండి పెడుతుంటే నన్నే కరుస్తుందేమిటయ్యా, దీనికి ఒళ్ళు కొవ్వెక్కి కొట్టుకుంటోంది. అసలు దీనికి కళ్ళు నెత్తిమీదకి రావడాని క్కారణం నువ్వు, నీ వాళ్ళంతా దీన్ని నెత్తి మీదకెక్కించుకోడమే. రానియ్ మున్సిపాల్టీ బండి, దీని పని చెబుతా" అని ఆరోపణలు చేస్తూ అరిచాడు వెంకట్.

"వుత్తినే అదెందుకు కరుస్తుంది? నువ్వేం జేశావో!" అన్నాడు కుక్క.

వెంకట్ యింతెత్తున లేచాడు కుక్క మీదకి, తనని కరచినా కుక్క, దాన్నే సపోర్టు చేస్తున్నందుకు మండిపడుతూ.

ఇంతలో, "వెంకట్రావ్ మొన్నో పెద్ద మనిషి బల్ల కిందనుంచి అందించిన నోట్లకట్ట అందుకున్నావా, లేదా ? నిన్ననో ఆడ కుక్కతో సినిమా కెళ్ళావా, లేదా ? ఇంటి కొచ్చాక అడ్డుపడితే లైకాని కొట్టావా, లేదా ?" అనే మాటలు ఎక్కడనుంచో విన బడ్డాయి.

"అదీ సంగతి! కరవమంటే కరవదూ? నువ్వా గాడిదపనులు చేసొచ్చి ముత్తయిదు పోజు పెడుతున్నావ్ కాబట్టి తగిన శాస్తి జరిగిందిలే" అన్నాడు కుక్క. అయితే యిద్దరికీ ఎవరో గిల్లినట్లయింది. మెడ మీద మిడతపడ్డట్టు స్పృహలోకొచ్చి ఒకళ్ళ నొకళ్ళు కళ్ళు బాగా తెరిచి, నోరెళ్ళబెట్టి చూసుకున్నారు. చెట్టుకింద లైకా ఠీవిగా నుంచోనుంది. కాస్త పెడగా తామిద్దరూ తప్ప అక్కడ యింకెవరూ లేరు. అయితే వెంకట్రావ్‌ని సంబోధిస్తూ ఇప్పుడు మాట్లాడిందెవరు ? కంగారుపడి యింటిచుట్టూ, చెట్టుచుట్టూ తిరిగి చెట్టుమీదికి చూశారు. ఎక్కడా ఎవరూ లేరు. తమ మాటలు వింటూ ఎక్కడ్నుంచో ఎవరో జవాబు చెబుతున్నారని తెలుసుకుని స్మశానం వంకే చూస్తూ లోపలికి పోయి నోరుమూసుకున్నారు పెళ్ళాలకి అర్జెంటుగా యీ విషయం చెప్పడానికి సిద్ధమవుతున్నారు.

మరో రోజున మరో ఘోరం జరిగింది. సుబ్బారావు పెళ్ళాం హనుమాయమ్మ తొడ కరిచేసింది లైకా. హనుమాయమ్మ ఆడ హనుమాన్ అయిపోయింది. ప్రత్యక్షంగా లైకానీ, అప్రత్యక్షంగా కుక్కకుటుంబ సభ్యులందరినీ శాపనార్థాలు పెట్టింది. ఎట్లా

దొరికిందో హనుమాయమ్మ తొడ లైకాకి. ఆవిడ సుబ్బారావుకి తప్ప మరొకరికి చూపించలేకపోయింది! తక్కినవాళ్ళు మేం చూడందే నమ్మమన్నట్లుగా మొహాలుపెట్టారు. హనుమాయమ్మ పిడకలేసినట్లు చేతులు తిప్పుతూ తిట్టింది లైకాని.

"నువ్వేం చేశావో? ఏం జెయ్యకపోతే అదెందుకు కరుస్తుంది?" అని ప్రశ్న కాని ప్రశ్న వేసింది కుక్క పెళ్ళాం.

ఇంతలో—"ఇంట్లో వూడ్చిన పాచంతా చాటతో తీసుకొచ్చి నెత్తిమీద పడేట్లు పోస్తే కూడా వూరుకోవాలా? ఎక్కడ పోస్తున్నదీ కనబడనంతగా కళ్ళుపోయినయ్యా; లేక కళ్ళు నెత్తిమీదకెక్కాయా?" అనే మాటలు వినబడ్డాయి.

"అదీ సంగతి! పాచిపొయ్యడానికి లైకా తలకాయే దొరికిందా నీకు! కావాలంటే నీ మొగుడుమీదే బుక్కాయిలా చల్లుకోబోయినావా?" అంది కాంతమ్మ.

హనుమాయమ్మ చాలీసా ఆపేసింది.

తను పాచిపోశానని ఎవరన్నారబ్బా! అని చుట్టూ చూస్తోంది. అక్కడ జానకమ్మ, కాంతమ్మ, హనుమాయమ్మ తప్ప యింకెవరూ లేరు. పిల్లలు బయట దూరంగా గోడుంబిళ్ళాడుకుంటున్నారు.

లైకా చెట్టుకింద వేయించుకున్న తన మంచంమీద పరుపులుంగచుట్టి బాలీసులాగా తలకింద ఆనించుకుని కాలుమీదకాలు వేసుకుని చక్రవర్తిలాగా చెట్టునీడనే ఛత్రంగా భావించి దీర్ఘంగా ఆలోచిస్తూ వుంది.

అంతా తిరిగి ఎవరు మాట్లాడారబ్బా అని చుట్టూ చూశారు, ఇంటిచుట్టూ దొంగాట ఆడుతున్నట్లు తిరిగి చూశారు, చెట్టుమీద చూశారు.

ఎక్కడా ఎవరూ లేరు. స్మశానంలో మాత్రం ఎవరో తొందరపడిపోయి ఊళ్ళో వుండలేక పరుగెత్తుకొచ్చినట్లు చుట్టూ కర్ర ముక్కలు చేర్చుకుని మండి పోతున్నారు. అంతే, ముత్తయిదువులంతా ఎవరి వాటాల్లోకి వాళ్ళు కాలిమట్టెలుకూడా చప్పుడు చెయ్యనియ్యకుండా వెళ్ళిపోయి తమతమ తలుపుల గొళ్ళేలు పెట్టేసుకున్నారు. తమ మొగుళ్ళకి ఎప్పుడు చెప్పేద్దామా అని ఆత్ర పడుతున్నారు.

## 8

లైకా ప్రవర్తన మరీ మితిమీరి పోతున్నదని, దాని మూతి తమ కుటుంబ వ్యవహారాల్లో దూర్చడం మరీ ఎక్కువయిపోయిందనే అనుమానం, యింతకాలం దాన్ని కళ్ళు చెవులు మూసుకుని సపోర్టుచేసిన కుక్కకి కూడా దృఢపడే సంఘటన మరొకటి జరిగింది.

ఆవేళ ఆఫీసులో ఒకాయన కాలం తీరి రిటైర్ అవుతుంటే అల్పాహార విందు ఏర్పాటు చేశారు. ఆయన్ని పొగిడే మీటింగు పెట్టారు. అంతా ఆయన చనిపోయినట్లు యింట్లోనే యికనుండి పూడ్చిపెట్టబోతున్నట్లుగా ఉపన్యాసాలిచ్చారు. ఆయన జీవితాన్ని, యవ్వనాన్ని ఆఫీసు పనికి అంకితం చేశారని, ఆయన చర్మాన్ని స్వయంగా ఆయనే చెప్పులుగా కుట్టుకుని ఇంటినుంచి ఆఫీసుకి రావడానికి వుపయోగించే వారని ఆఫీసు కవిగారొకాయన పంచరత్నాల్లో చమత్కరించారు.

విందు కుడిచాక, అంతా ఆయన్ని దండతో మధ్యలో కూచోబెట్టి చావు ఫొటో లాంటి గ్రూప్ ఫొటో ఒకటి తీయించు

కున్నారు—ఆయన జ్ఞాపకార్థం, దహన సంస్కారానికి ఏర్పాట్లన్నీ అయిపోయాక అంతా యిళ్ళకి బయల్దేరారు. కుక్క నిజంగానే స్మశానంవేపు బయల్దేరాడు.

అదీ, ఆకారణంగా ఆవేళ కుక్క యింటికి రావడం ఆలస్యమైంది.

పైన కారుమేఘాల ఆకాశం, కింద భూమి కలిసి ఒక రాక్షసి గుడ్డులాగా, అది పగిలి చీకటి కారుతున్నట్లుగా వుంది రాత్రి. చింతగీర్లు చంద్రనిప్పులా అరిచినట్టుగా గీ పెడుతున్నాయి. స్మశానంలో మంటల నీడలు చెరువు నీటిమీదా, తమ యింటికప్పు మీదా పడుతున్నయ్.

కుక్క సైకిల్ దిగి చుట్టూ చూశాడు. గుమ్మందగ్గర లైకా కనబడలేదు. సావిట్లో లేదు. బయట చెట్టుకింద లేదు. ఇంటిచుట్టూ తిరిగాడు, ఎక్కడా కనపడలేదు. చెరువులో మంట నీడలో అలల కదలిక, బుడుంగు బుడుంగుమనీ శబ్దం వస్తున్నాయి. బితుకు బితుకుమంటూనే అటెళ్ళాడు కుక్క. మొదట ఎక్కడా ఎవరూ కనబడలేదు. నిదానించి చెరువులోకి చూస్తే, నీళ్ళలోంచి తల పైకెత్తి యీదుకుంటూ ఒడ్డు కొచ్చి ఒళ్ళయినా దులుపుకోకుండా సహజ గంభీర మైన ఠీవితో, కుక్క ముందునుంచే యింటి వేపు నడుస్తోంది లైకా.

కుక్కకు మతి చలించింది. ఆవేళప్పుడు అది చెరువులోకి దిగడమేమిటి? చెరువు అడుగు నుంచి సునాయాసంగా నీటి జంతువు లాగా బయటికి రావడమేమిటి? ఏమీ అర్థం గాక, "ఆసలిది లైకా, అవునా, కాదా"అనే అనుమానమొచ్చి "సంశయ నివృత్తి మానవుని ప్రథమ కర్తవ్యం" అని ఎవరో హరికథలో చెప్పింది గుర్తొచ్చి"లైకా" అని గట్టిగా పిలిచాడు.

వడివడిగా పోతున్న లైకా వడి తగ్గించి ఆగింది. వెనక్కి తిరగలేదు. కుక్కవంక చూడలేదు. నడుస్తున్నదల్లా ఆగి నుంచుంది, అంతే. కుక్క పరిగెత్తుకుంటూ లైకా దగ్గరకొచ్చి పరిశీలనగా చూశాడు. నెత్తి మీద మొట్టికాయ కొట్టుకుని, చెవులు రెండు గిల్లుకుని చూశాడు. సందేహంలేదు, అది లైకాయే.

ఎసర్లకుండలా కుక్క వొళ్ళు కుత కుత లాడి పోయింది. వేళగాని వేళ చెరువులోకి దిగింది; దీనికిప్పుడు జలుబు చేస్తే దీని బాబు ఎవడు డాక్టర్ దగ్గరికి తీసికెళతాడు. అదిగాక యజమాని పిలుస్తుంటే వెనక్కి యినా తిరక్కుండా, కుక్కలా కాస్తయినా విశ్వాసంలేక మనిషిలా ప్రవర్తిస్తుందా?

"ఇల్లు కాపలా కాసే టైములో స్నానాలూ, షికార్లూ చేస్తున్నావన్నమాట? నిన్ను తరిమేసి యింకో కుక్కకి చీట్లు వేసు కోడం మంచిది" అన్నాడు కోపంగా.

లైకా కళ్ళెర్రజేసి, పళ్ళు బయటపెట్టి గుర్రుమంది.

కుక్క అప్రయత్నంగా ఒక్క టంటిం చాడు దాన్నెత్తిమీద. అదీ కుక్క చేసిన నేరం. లైక రెండు కాళ్ళూ పైకెత్తి కళ్ళు మరింత పెద్దవి చేసి గుర్రు గుర్రుమంది రెండు మూడు సార్లు. అంతే మరుక్షణం ఫట్‌మని కుక్క కాలు పట్టుకుంది. కుక్క గావుకేక పెట్టి 'జానీ' 'జానీ' అని కుక్కని పిలిచినట్లు పెళ్ళాం జానకమ్మని పిలుస్తూ యింటివేపు పరిగెత్తాడు. గుమ్మంవచ్చే వరకూ కాలొదల్లేదు లైకా.

అంతాలేచి కంగారు పడ్డారు. లైకా ప్రవ

ర్తనకి. తక్కిన వాటాల వాళ్ళు లైకా కుక్కని కరవడం లైటుగా తీసుకున్నారు. జానకమ్మకి కూడా ఒళ్ళు భగ భగ మండింది. మూలనున్న కొండచీపురు విసిరినా వున్నచోటనుంచి కదల్లేదు లైకా. గుర్రు గుర్రుమని నిప్పులు కక్కుతూ చూస్తోంది. ఎవరూ లైకా దగ్గరి కెళ్లలేక పోయారు. ఈలోగా కుక్క బాధ మరీ పెరిగి మూలుగుతుంటే డాక్టర్ దగ్గరికి తీసి కెళ్ళారు. ఆయన మనుషుల డాక్టరే గాని, జంతువులే ఎక్కువగా ఆయన దగ్గరికి ట్రీట్‌మెంటుకి వస్తుంటాయి. జంతు డాక్టర్ కుక్కని పరిశీలనగా చూసి, "యిది కుక్క కాటు కాదు" పొమ్మన్నాడు. కుక్కకీ, కుక్కని తీసుకొచ్చిన వారందరికీ మతి చలించింది. డాక్టర్‌కే మతి చలించిందని నిర్ధారణ చేసుకుని అటునుంచి ఆదే కుక్కలాసుపత్రికి తీసుకెళ్ళారు. అక్కడ కూడా కుక్కని కుక్కలాగా చాలా సేపు కూచో బెట్టి అన్ని పరీక్షలూ చేసి "ఇది కుక్క కాటు కాదు పొమ్మన్నారు."

ఇంటికొస్తే, బయట చెట్టు కింద చెట్టుకి కాలు పెట్టి పోస్తూ "మా బాగా జరిగిందిలే" అని కుక్క వంక చూస్తూ ఎగతాళిగా నవ్వుతోంది లైకా. కుక్కకి మిరపకాయలు చిదిపి వళ్ళంతా రుద్దినట్లయింది. సిగ్గులేదు, పైగా నవ్వుతోంది అనుకున్నాడు. మూలుగుతూ మంచమెక్కాడు. జానకమ్మే కాస్సేపు డాక్టరు పోజుపెట్టి కనబడిన ఆకులు దూసుకొచ్చి నూరి కట్టు కట్టింది.

కుక్క ఆఫీసుకి సెలవు పెట్టి కుంటుతుంటే పక్క వాటాలవాళ్ళు యధాశక్తి సంతోషించారు. దీన్నెట్లానన్నాసరే తోలెయ్యాలనుకున్నారు కుక్క కుటుంబ సభ్యులు. అంట్లు తోముకుంటూన్నప్పుడు, ముఖాలు కడుక్కుంటున్నప్పుడు నెమ్మదిగా ప్రజాభిప్రాయ సేకరణ మొదలెట్టారు.

రెండు వాటాల వాళ్ళు కుక్కమీద కోపంతో లైకాని తోలెయ్యడానికి వీల్లేదన్నారు. తక్కిన రెండు వాటాలవాళ్ళు లైకాని తోలెయ్యాలని పట్టుబట్టారు.

"నీ కాలి వరకు వొస్తే తప్ప నీకు తేలీ లేదా" అని దాన్ని వుంచితీరాలని పట్టు బట్టే వాళ్ళు ఎత్తి పొడిచారు. "నా పెళ్ళాం తొడ చీరేస్తే నీకు నవ్వొచ్చిందా? యిప్పుడు ప్రజాభిప్రాయం మన్నిస్తానని పోజు పెడతావా? టాట్ అదేం కుదర్దు. దానికి పౌరుషం జాస్తి, అది వుండి తీరాల్సిందే" అని కూడా అన్నారు అవతలి వాళ్ళు.

అటూ యిటూ ప్రజాభిప్రాయ తూకం సరి సమానం కావడంతో ఆట డ్రా అయింది. సమస్య ఎటూ తేలక, ఘనీభవించి, వాటాల్లోని పౌర జీవనం స్థంభించి పోయింది.

లైకా తన కివేమీ పట్టనట్టు దానిష్టం వచ్చినట్టు ప్రవర్తిస్తోంది. తిండి పెట్టకపోతే ఆవేళ ఏ వాటావాళ్ళు పెట్టాలో గుర్తు చేసుకుని వాళ్ళ వంటింట్లోకే సరాసరి వెళ్ళి తినేసొస్తోంది. దాన్ని తోలెయ్యడానికి ఎవరికీ గుండెలు చాలడం లేదు. దాన్తో లైకా నొదిలించుకోడానికి తక్కిన వాళ్ళు కూడా కాస్త మెత్తబడుతున్న సూచనలు కనబడుతున్నయ్.

లైకా నెలా వొదిలించుకోవాలో తెలీక ఒక రహస్య పథకం తయారుజెయ్యమని యింట్లోనే పెళ్ళాం అధ్యక్షతన, పిల్లలు సభ్యులుగా ఒక రహస్య సంఘాన్ని నియమించాడు కుక్క. పథక రచనలో తల్లితో సహకరించడానికి చేగోడీలు, పకోడీలు,

మిరపకాయ బజ్జీలు సంఘ సమావేశమప్పుడు రోజు కాక ఐటెమ్ చేసుకు తినడానికి, తింటూ చర్చించడానికి కొంత మొత్తాన్ని కూడా కేటాయించాడు, ఆఫీసులో హాండ్ లోన్ (చేతప్పు) తీసుకుని.

సంఘ సమావేశాలు వంటింట్లో పీట వేసుకుని అల్పాహారాల మీద బాగానే జరుగుతున్నాయి. పిల్లలు కూడా అల్లరి చెయ్యకుండా, బుద్ధిగా కూర్చుని ఆలోచిస్తున్నారు మేధావుల్లా పోజుపెట్టి. కుక్కల అలవాట్ల దగ్గర నుంచి కుక్క బుద్ధి వరకు అన్ని అంశాలూ సమగ్రంగా, కూలంకషంగా చర్చిస్తున్నారు. అల్పాహారం ఖర్చు పెరిగిపోతున్నది తప్ప పథకమేదీ తుది రూపానికి రావడం లేదు.

కుక్కటేశ్ అనివార్య కారణాలవల్ల మరో రోజున కూడా ఆఫీసునుంచి యింటికి ఆలస్యంగా రావలసొచ్చింది. చెరువు దగ్గరకి రాగానే మళ్ళీ అదే దృశ్యం అతని కళ్ళబడింది. సైకిల్ దిగి, తనకే ఆనించుకుని నిశ్శబ్దంగా చూస్తూ నిలబడ్డాడు కుక్క. లైకా చెరువు అడుగునుంచి తల పైకెత్తి అటూ యిటూ చూసి యీదుకుంటూ ఒడ్డుకొచ్చింది. నెమ్మదిగా అడుగులో అడుగు వేస్తూ యింటివేపు నడుస్తోంది.

కుక్క సైకిల్ని లైకా ముందుకి నడిపించి, దానికి అడ్డంగా ఆపి, స్టాండు వేసి లైకా కెదురుగా నుంచుని పరీక్షగా చూస్తున్నాడు. పక్కకు తప్పుకుని, నాలిక బయటికి జార్చి కుక్కని పట్టించుకోకుండా వెడుతోంది లైకా. భారంగా నడుస్తోంది. పొట్ట పెద్దదిగా కనబడుతోంది. దీని నడకా, పొట్ట చూస్తుంటే లైకా మీద జాలి కలిగింది కుక్కకి. ఏదన్నా జబ్బు చేసిందేమో పాపం! ఎప్పుడూ కసురుకోడమేనా, కాస్త మంచిగా మాట్లాడదాంఅనుకున్నాడుకుక్క.

"లైకా హైరో" అన్నాడు.

ఆగి, అట్లాగే నిలబడింది లైకా

"ఏంటి లైకా ఏంజరిగింది నీకు" అన్నాడు వొంగి మోకాళ్ళ మీద కూర్చుని మనిషితో మాట్లాడుతున్నట్లు లైకా తల తీసుకొచ్చి ఒళ్ళో పెట్టుకుంటుందనీ, నాలిక వేలాడేసి తనని గోముగా రాసుకుంటుందనీ, అప్పుడు దాని తల నిమిరి అనునయిద్దామనీ అనుకున్నాడు కుక్క.

ఇంతలో "అట్లా మనిషిలా మాట్లాడితే చెబుతారు గాని, కర్రపట్టుకుని కొడుతూ, పశువులా ప్రవర్తిస్తుంటే ఏం చెబుతారు" అనే మాటలు వినబడ్డాయి. కుక్క అదిరిపోయాడు. అక్కడ లైకా, తనూ తప్ప ఎవరూలేరు,

"లైకా నువ్వేనా మాట్లాడేది?" అని ఆశ్చర్యపోతూ ఆ దుమ్ములోనే ఎవరో తోసినట్లు చతికిల పడిపోయాడు కుక్క.

"నీ కొక్కడికేకాదు, తెలుగులో మాట్లాటం నాకూవచ్చు

నేనే మాట్లాడేది వినబడ్డంలేదా, కనబడ్డం లేదా" అంది లైకా

"మరి యీ పొట్టేమిటి జబ్బేమన్నా చేసిందా?" అని అడిగాడు కుక్క

"ఎప్పుడూ దిక్కుమాలిన ఆలోచనల్లే మంచి ఆలోచన ఒక్కటీరాదు. కడుపుతో వుంటే పొట్టవుండక నడ్డి వుంటుందా?" అని ఎదురు ప్రశ్న వేసింది లైకా

"నీక్కడుపేంటి నువ్వు మగ కుక్కవి గదా" అన్నాడు కుక్క మరింత ఆశ్చర్యపోతూ.

*(మిగతా 43వ పేజీలో)*

(17వ పేజీ తరువాయి)

"అది నే పుట్టినప్పుడయ్యా. చచ్చేవరకూ అట్లాగే వుండమంటావేంటి? మధ్యలో కొంత కాలం ఆడదాన్ని కావా లనుకున్నాను అయ్యాను. ఆడదాన్నయ్యాక కడుపురాక కాలొస్తుందా? సరే, పద, పద, పొద్దున్న ఎప్పుడు తిన్నావో పద" అని తిరిగి నడక మొదలెట్టింది లైకా.

"లైకా, ఆగు చెరువులోకి వెడతావేంటి" అన్నాడు కుక్క. ఇదే అదను అన్ని ప్రశ్నలకీ సమాధానాలు ఒక్కసారే రాబట్టేసుకోవాలని.

"ఇది మరీ బాగుంది. మొగుడు చెరువులో వుంటే, కాపురం గట్టు మీద చెయ్యమంటావా బాగానే వున్నాయ్ తెలివితేటలు" అని యీసడించుకుని వెళ్ళిపోతోంది లైకా,

కుక్కకి దీని యీసడింపు చూడగానే నిజంగానే కోపం వచ్చింది. సైకిల్ స్టాండు తీసి, దాని మీదకి చక్రం ఎక్కించడానికి వెంట బడ్డాడు. అంత పొట్టతోనూ కుక్కని బాగా పరిగెత్తించి ఒక్కసారి ఎగిరి కుక్క మీదికి లంఘించింది కుక్క ధన్మని సైకిల్ మీదవేసుకుని పడిపోతే తొడ కరిచేసి చెంగున చెరువులోకి దూకేసింది లైకా. కుక్క ఒక చేత్తో తొడ పట్టుకుని మరో చేత్తో సైకిల్ పక్కకి తొలగించి లేచాడు.

మళ్ళీ అంతా లాంతర్లేసుకుని, బండి తీసుకొచ్చి మరో డాక్టర్ దగ్గరికి తీసుకు పోయారు కుక్కని ఈ డాక్టర్ కాస్త మంచోడు. పెద్ద మనిషి, రోగి కనబడగానే కాగితం రాసిచ్చి నోట్లు జేబులో పడేసుకుని పొమ్మనే రకం కాదు. చాలా పరీక్షలుచేసి- "యిది కుక్క కాటు కాదు నాయనా" అన్నాడు." మరింకేమి టండీ" అని ఏక కంఠంతో అడిగారంతా, జరిగిందంతా. పూసగుచ్చి నట్టుచెపుతూ.

మీరెన్ని పూసలు గుచ్చినా లాభం లేదు. ఇది కుక్క కాటు మాత్రం కాదు. ఇదేదో జలచరం కాటు. భూచరం కాటుమాత్రం కాదు. ప్రమాదం లేకుండా వుండటానికి యింజక్షన్ చేస్తున్నాను. ఎక్కడా యీత కొట్టబోకు" అన్నాడు తాపీగా యింజక్షన్ చేస్తూ కట్లుకట్టి. నూటయాభై రంగుల బిళ్ళలు తీసుకుని, టానిక్కులు రాయించుకుని, పత్యం కనుక్కుని యింటికి తీసుకు వచ్చారు.

ఊరేగింపుగా వస్తున్న వాళ్ళని చూస్తూ చెట్టుకింద మహారాణిలా పడుకుంది లైకా. పొట్ట మరీ పెద్దదిగా కనబడుతోంది. అది పడుకున్న పద్ధతిని చూడగానే దాన్ని వొదిలించుకునే మార్గం చటుక్కున తట్టింది కుక్కకి.

అంతా పడుకున్నాక నెమ్మదిగా మంచం దిగి, ఖాళీ గోనె సంచీ ఒకటి తీసుకుని, చెట్టుపక్క నక్కి, అది గాఢ నిద్రలో వుందని రూఢి అయ్యాక నెమ్మదిగా గోనె సంచీ రెండు చేతుల్తోను బాగా తెరచి దాని మూతి కింద నుంచి దూర్చి ఒకసారి ఎత్తి దాన్ని బలంగా లోపలికి తోసేసి గబగబా సంచీ మూతి కట్టేసి, బరబరా యీడ్చుకుంటూ దూరంగా తీసికెళ్ళి కొండలాంటి ఓ పెద్ద గుట్టవుంటే దాన్నెక్కి అక్కణ్ణుంచి గోనెసంచీని తోసేసి చేతులుదులుపుకుంటూ యింటివేపు తిరిగాడు. ఇంత చేస్తున్నా అదేం చిత్రమో లైకా కుయ్ మనలేదు,కయ్ మనలేదు. కుక్క యింటికొచ్చి అందర్నీ లేపి, తనెంత తెలివిగా, ధైర్యంగా దాని పీడ విరగడ చేసిందీ వివరించాడు. అంతా ఆనందించారు.

ఇంక కుక్కా వద్దూ, నక్కా వద్దూ అని అనుకున్నారు, మళ్ళీ కాఫీలు కాచుకుని సంతోషంగా తాగి. మళ్ళీ తాంబూలాలు వేసుకుని సిగరెట్లు కాల్చుకుని పడుకున్నారు.

తెల్లవారు జామున ఒకటికొస్తే ఒక్కడే బయటికొచ్చాడు కుక్కు. లైకా పడుకునే చోట పడేట్లు, నుంచునే చెట్టుకి పెట్టిపోస్తుంటే కటిక్కిన ఉక్కుపళ్ళ బోను మోకాలి కండని పటుకున్నట్లయింది. ఉక్కుపళ్ళు కండలో దిగిపోతున్నాయ్, కుక్కు అదిరిపోయి వెనక్కి తిరిగి కిందకి చూశాడు. చింతనిప్పుల్లా మెరుస్తున్న కళ్ళతో లైకా.

"లైకా వొదులు, లైకా వొదులు, వొదులు" అని లైలాని మజ్నూ పిలుస్తున్నట్లు, గట్టిగా అరుస్తూ బతిమాల్తున్నాడు కుక్కు.

లైకా కుక్కు కాలొదిలి ఎదురుగా వొచ్చి నుంచుంది.

"నువ్వు, నువ్వు నిజంగా లైకావేనా?" అన్నాడు కుక్కు గుండె అదురు తగ్గలేదు. గుండె బయటి కొచ్చేసి కొట్టుకుంటున్నట్లుగా వుంది.

"అదిరిపోకు. నేను లైకానే. నేను చావలేదు. మీరు నన్ను చంపలేరు. కానీ ఒక సంగతి గుర్తుంచుకో. నువ్వుగాని, నీ కుటుంబ సభ్యులుగాని, పీ యితర వాటాల సభ్యులుగాని మళ్ళీ నన్ను చంపడానికి ప్రయత్నించారో నేనింక మిమ్మల్ని కరవడంతో వూరుకోను. నేనూరుకున్నా చెరువులో వున్న నా మొగాడు వూరుకోడు. వినబడుతున్నదా? మీ వాళ్ళందరికీ నన్ను గౌరవంగా చూడడం నేర్చుకోమని చెప్పు. నన్నేకాదు, నాకు పుట్టబోయే బిడ్డని కూడా గౌరవంగా చూడడం యిప్పట్నుంచీ నేర్చుకోమని చెప్పు. ఆగు, కదలకు. నేనిప్పుడు కడుపుతో వున్నానని నీకు తెలుసు, నాకిప్పుడు అల్లంచట్నీతో వుల్లి పెసరట్లు తినాలనుంది. పోయి వెంటనే వొండించి చెరువు గట్టుకి తీసుకురా, తెలిసిందా?" అంది లైకా.

"తెలిసింది" అని తలూపి, నోటితో కూడా అన్నాక చెరువువేపు తిరిగింది లైకా.

కుక్కు ఆశ్చర్యం తీరక దాని వెనకే తను కూడా చేతులు నేల మీద ఆనించి కుక్కలాగా నడుచుకుంటూ వెళ్ళాడు.

లైకా చెరువు దగ్గరకొచ్చింది. గట్టు మీద నుంచుని భౌ మంది. అది వినగానే చెరువులోంచి పెద్ద మొసలి తల పైకెత్తి చూసి నోరు తెరిచి మళ్ళీ దుంగలాగా నీళ్ళలో మునిగింది దాని నెత్తిమీద టోపీ లాంటిదేదో వుంది. దాని రంగేమిటో. అది టోపీయో మరేమిటో కుక్కుకి సరిగా కనిపించలేదు.

లైకా తలపైకెత్తి గట్టిగా నోరు తెరిచి, ఆవులించి ఒళ్ళు విరుచుకుంది. అంతే.

లైకా మొసలిగా మారిపోయింది. పెద్ద పొడుగాటి నోరు, బోనులాంటి వుక్కుపళ్ళు, పొడుగాటి పెద్దపొట్ట, తాటి పట్టెలాంటి తోక "త్వరగా పెసరట్లు తీసుకురా" అని అరిచి జర్రున చెరువు నీళ్ళలోకి జారి పోయింది మొగుడు మొసలిని కలుసుకోడానికి.

నీటి అడుగున రెండు మొసళ్ళ ఆకారాలు దగ్గరగా నీడల్లా పాకుతున్నాయ్.

ఈ జలదృశ్యాన్ని చూసి కాసేపు ఒళ్ళు జలదరించి, ఆజ్ఞ గుర్తొచ్చి, పెసరట్లు వేయించి తీసుకురావడానికి యింటివేపు తిరిగి, అంత వరకూ ఎలా వున్నాడో అలానే, చేతులునేల మీద మరింత గట్టిగా ఆనించి చతుష్పాదంతో నడుచుకుంటూ, భౌభౌ మని అరుస్తూ యింట్లో ప్రవేశించాడు కుక్కు టేశ్వర్రావ్. •